# ఆమె ఎవరు?

## ఇందూ రమణ

చీకటి చిక్కగా ఉంది.

ఆకాశం మేఘావృతమై ఉంది.

ఒకటే ఉరుములు... మెరుపులు!

ఎక్కడా జన సంచారం లేదు.

వీధివీధంతా నిర్మానుష్యంగా ఉంది.

అప్పటికి సరిగ్గా పన్నెండు గంటలవుతోంది!

అర్ధరాత్రి!

ఎక్కడ నుండో వూరక్కలు అరుపులు! కుక్కలు ఏడుస్తున్న ఏడుపు అతి భయానకంగా ఉంది!

చావు ముందు అరిచే తీతువు అరుపులా కుక్కలగోల!

ఆ నిర్మానుష్యమైన నిశ్శబ్ద నిశీథిలో—

నిప్పు కణికలా దిగంబరంగా ఒక వ్యక్తి నడచి వెళ్తున్నాడు నిర్వికారంగా.. అతి ధైర్యంగా ముందుకు నడిచి వెళ్తున్నాడు.

అతన్ని చూసి కుక్కలు భయంతో అరుస్తూ పారిపోతున్నాయి. కొన్ని కుక్కలు ధైర్యంగా నిలబడి అరుస్తున్నాయి.

అతను మాత్రం దేన్నీ లెక్క చెయ్యకుండా రాక్షసుడిలా ధీమాగా నడిచి వెళ్తున్నాడు.

అతని చేతిలో బెత్తం ఉంది.

అతని కళ్ళల్లో ఏదో దివ్యమైన వెలుగు. అతని మొహంలో కొట్టొచ్చినట్టూ కన్పిస్తున్న పైశాచికత్వం.

అతని శరీరం మీద ఎక్కడా నూలుపోగు కూడా లేదు.

అతను మధ్య వీధి దాటి రాజవీధిలో అడుగు పెట్టాడు.

ఆ వీధిలో ఎక్కడా వీధీ దీపాలు కూడా లేవు. అయినా, అతను అంచనా మీద ముందుక సాగిపోతున్నాడు.

ఉన్నట్టుండి చీకట్లో నుండి పెనుభూతంలా ఓ వ్యక్తి వచ్చి అతని మీద పడ్డాడు. పిచ్చి పిచ్చిగా అరుస్తూ నవ్వుతూ అతన్ని నెట్టుకుంటూ ముందుకు పారిపోయాడు.

ఆ వ్యక్తి పిచ్చివాడు.

రోజంతా వూరు మీద తిరిగి తిరిగి రాత్రయ్యేసరికి శ్మశానంలోకే వెళ్ళి పడుక్కుంటాడు.

రాజవీధి దాటే దాటగానే పెద్ద చెరువు.

ఆ చెరువును ఆనుకునే ఉంది శ్మశానం.

ఆ రోజు సాయంకాలమే దిక్కూమూక్కూ లేని అనాధశవానికి పంచాయితీ వారు దహన సంస్కారం జరిపించారు.

ఆ మంటలు ఇంకా ఆరలేదు.

ఎర్రటి చీకట్నే దహించేస్తున్నట్టూ ఉంది.

అతను ధైర్యంగా శ్మశానికి అడుగు పెట్టాడు.

ఆ రోజు—

ఆ అనాధ శవంతో పాటు ఓ పెద్దింటి ఆడపడుచు పుణ్యస్త్రీగానే మరణించింది.

ఆమెది సహజ మరణం కాదు.

ఎవరో చేతబడి చేసి చంపేసారు.

ఆ చేతబడి చేయగల దిట్ట అతనే! అతనే ఆ వూరు వూరంతటికే ఏకైక మాంత్రికుడు. తాంత్రికుడు.

ఆమె ఏ కోరికలూ తీరకుండా మరణించిన ఇల్లాలు.

ఆమెని కలవడానికి వచ్చాడు అతను.

అతను తిన్నగా వెళ్ళి ఓ సమాధి ముందు ఆగాడు.

ఆమెని సమాధి చేసిన స్థలం అదే!

మట్టి పెళ్ళగించాడు.

ఆ గోతిలో—

స్త్రీ శవం పడుకున్నట్టే ఉంది!

అతను ఆ శవం ముందు కూర్చొని అరగంట పాటు ఏవేవో పూజలు జరిపాడు. మంత్రాలు జరిపించాడు.

అతను మంత్రాలు జరిపిస్తున్నంత సేపూ గాలి స్థంభించి పోయింద. ఆకాశంలో వురుములు మెరుపులు ఉధృతమైనాయి.

వూరు వూరంతా వూరకుక్కలు అరుపులు.

అతను తన చేతిలో ఉన్న బెత్తంతో ఆ శవం నెత్తిమీద మూడుసార్లు ఏవో మంత్రాలు చదువుతూ సుతారంగా కొట్టాడు.

అంతే!

ఆ స్త్రీ శవంలో చిన్న కదలిక.

నెమ్మది... నెమ్మదిగా నేత్రాలు తెరిచింది.

మరింత నెమ్మదిగా ఆ శవం లేచి కూర్చుంది.

మళ్ళీ, అతను ఏవో మంత్రాలు జపించి ఆమె నెత్తిమీద మరోసారి మంత్ర దండం తో కొట్టాడు.

ఆ స్త్రీ శవం చురుగ్గా అతని కళ్ళల్లోకి చూసింది.

"వూ! ఇప్పుడు చెప్పు, నేనంటే నీకు అసహ్యం, ఎంత పొగరే నీకు!" అతను కోపంగా అరిచాడు.

"అసహ్యం కాదు. జాలి. నువ్వు మగాడివి కాదని వూరంతా అంటుంటారు:" ఆ స్త్రీ నెమ్మదిగా ట్రాన్స్‌లో ఉన్నట్టూ అంది.

"నేను... నేను... మగాడ్ని... మాగాడ్ని కాదా? అహ్హా! అహ్హా! అహ్హా!" అతను పెద్ద పెట్టున నవ్వాడు.

"వూ! అనుభవించి. నన్ను అసహ్యించుకొని నా కోర్కెని కాదన్నందుకు మట్టి పాలయ్యావు. వూ నోరు తెరువు" హుంకరించాడతను.

ఆమె అతను చెప్పినట్టూ చేసింది.

"నాకలు బైట పెట్టు!"

ఆమె మర మనిషిలా చేస్తోంది.

ఆమె నాలుక బైట పెట్టగానే బెత్తంతో ఉన్న కర్ర నుండి కత్తిని బైటకు లాగుదు అతను.

ఆమె నాలుకని పరపరా కోసేసాడు.

నాలుక కొయ్యగానే ఆమె దబ్బన వెనక్కి పడిపోయింది.

కళ్ళు వాటంతటవే మూసుకు పోయాయి.

కసిదీరా శవం మీద వుమ్మేసి పూర్వంలాగే మట్టి కప్పేసి వెనుదిరిగాడతను.

అప్పటికి సరిగ్గా ఒంటి గంట అవుతోంది.

ఉలిక్కి పడి లేచాడు మాధవ!

మంచం మీద నుండి లేచి కూర్చున్నాడు.

జరిగిందంతా అతని కళ్ళముందే కదలాడుతోంది.

ఆమె... ఆమె... ఆస్త్రీ... ఆ శవం... ఎవరో కాదు.... తన... తన వదిన... తన వదిన.



వారం క్రితం గుండె జబ్బుతో రక్తం కక్కుకొని హఠాత్తుగా చనిపోయిన వదిన.

కానీ, ఈ కలేమిటి?

ఇదంతా తన భ్రమేనా?!

విక్షేపంతా... ఆరోగ్యంగా ఉండే తన వదిన ఉన్నట్టుండి చనిపోవడం ఆశ్చర్యం కాదూ!!

ఎవరైనా చేతబడి చేసారా?!

వూరందరూ అనుకున్నట్టే ఎవరో కిట్టని వాళ్ళు చేతబడి చేసి ఉండొచ్చు.

తన భ్రమ... తన ఆలోచన్లు ఇలా తనని కలల రూపంలో వెంటాడుతున్నాయి.

మంచం మీద నుండి లేచి, నిలబడ్డాడు మాధవ్.

గదిలో తనొక్కడే పడుకున్నాడు.

గదంతా చీకటి.

బెడ్‌లాంప్ కూడా ఆరిపోయింది.

బహుశా కరెంటు పోయింటుంది.

పెన్ టార్చి తీసి గడియారం వైపు ఫోకస్ చేసాడు.

సరిగ్గా ఒంటి గంటయింది.

గడియారం కేసి చూసి ఉలిక్కిపడ్డాడు మాధవ్.

గడియారం ప్రక్కనే నవ్వుతూ ఉన్న వదిని ఫోటో.

గదిలో ఎవరో నడుస్తున్న మువ్వల శబ్దం.

మాధవ్ గుండె జలదరించింది.

నెమ్మదిగా తడుముకుంటూ వెళ్ళి తలుపులు తెరిచాడు.

ఆ చీకట్లోనే షర్టు, వెదుక్కొని వేసుకున్నాడు. అలా చీకట్లో తడుముకుంటూనే రోడ్డు మీదకు వచ్చాడు.

దూరంగా... కనుచూపుల మేరలో దీపపుకాంతి మెరుస్తోంది.

మాధవ్‌కి ఎప్పుడు నిద్ర పట్టక పోయినా ఆ అర్ధరాత్రి టీ దుకాణంలో టీ త్రాగి వస్తాడు.

ఆ టీ దుకాణం ఎప్పుడూ రాత్రీ తెరచి ఉంటుంది. ఉదయం అయిదయ్యేసరికి ఆ షాపు మూసేస్తారు.

మాధవ్ సహజంగా రచయిత.

అర్ధరాత్రికో....అపరాత్రిలో లేచి కాగితాలతో కుస్తీ పడుతుంటాడు

ఆలోచిస్తూనే నడుస్తున్నాడు మాధవ్.

మాధవ్‌కి మనసు మనసులో లేదు.

వారం నుండి అర్ధరాత్రి లేవడం మానేసాడు. కథలు కూడా వ్రాయలేదు.

కానీ,

ఈ రోజు ఇంత భయంకరమైన కలరావడానికి కారణం అతనికి అర్ధం కాలేదు.

తన వూహల్లో... ఆలోచనల్లో రాత్రంతా వదినే ఉంది.

ఆ వూహే ఈ కలకు కారణం కావచ్చు.

నిజంగా— వదిన చేతబడి కారణంగానే చచ్చిపోయిందా? ఆలోచిస్తూ నడుస్తున్నాడు.

కానీ,

దూరం తరగటం లేదు.

దీపం వెలుగు రానురాను దూరమవుతోంది.

అతను ఎంత నడుస్తున్న దూరం తరగటం లేదు.

ఉలిక్కి పడ్డాడు మాధవ్.

తమ ఇంటికి అర ఫర్లాంగ్ కూడా లేని దుకాణం ఈ రోజు ఇంత దూరం ఎలా అయ్యింది?!

చుట్టూ పరికించి చూసాడు.

కటిక చీకటి!

ఏవీ కానరావటం లేదు.

కొంత దూరం ముందుకు నడిచి వెళ్ళాడు.

ఉన్నట్టుండి ఆ దీపం వెలుగు ఆరిపోయింది.

అదిరి పడ్డాడు మాధవ్.

చుట్టూ చీకటి!

ఏం చేయడానికీ పాలు పోలేదు.

ఛటుక్కున వెనక్కి తిరిగాడు.

అప్పుడూ చూసాడు.

దెయ్యాల మర్రి చెట్టు,

వూరవతల వుండే మర్రిచెట్టు ఇక్కడికి ఎలా వచ్చింది?!

తనే ఇంత దూరం నడిచి వచ్చాడా?!

ఎలా.. ఎలా సాధ్యం?!

మాధవ్ గుండెలో నెమ్మదిగా కంపన ప్రారంభమైంది. గుండె కొట్టుకోవడం అధికమైంది.

శరీరం చమట పట్టేసింది.

భయం... భయంగా ఇంటిద్దారి పడ్డాడు.

అప్పుడొచ్చింది కరెంటు.

వూరు వూరంతా కరెంటు పోయినట్టుంది.

అక్కడక్కడా వీధి దీపాలు వెలిగాయి.

మాధవ్‌కి పరిసరాలు అవగాహన కొచ్చాయి.

బజారు ఏరియా!

ఇంటి నుండి బయలు దేరి తాను చాలా దూరం వచ్చేసాడు.

చీకట్లో దారి ఎలా మర్చిపోయాడు?!

బస్సు స్టాండ్ దాటి గేటు దగ్గరకు వచ్చాడు.

కొండపైకి వెళ్లడానికి బస్సు దారి! మొదట్లో చెక్‌పోస్టు బిల్డింగ్

చెక్‌పోస్టు ప్రక్కనే తమ ఇల్లు.

అన్య మనస్కంగానే నడుస్తున్నాడు మాధవ్.

అదిరి పడ్డాడు ఉన్నట్టుండి.

కనుచూపు మేరలో—

చెక్‌పోస్టు గేటు దగ్గర... సిమ్మెంటు దిమ్మ మీద ఎవరో కూర్చున్నారు.

తెల్లగా... దేవతా వస్త్రంలా మెరుస్తోందా ఆకారం.

మాధవ్ గుండెలో కంపన అధికమైంది.

గుండె దడదడ లాడుతుండగానే నెమ్మదిగా నెమ్మదిగా ముందుకు అడుగులు వేస్తున్నాడు మాధవ్.

స్త్రీ ఆకారం.

దేవకన్యలా దేదీప్యమానంగా ఉంది.

ధైర్యం కూడగట్టుకొని నడుస్తున్నాడు.

ఆ చెక్‌పోస్టు ప్రక్కనుండే తను ఇంటికి వెళ్ళాలి.

భయం... భయంగానే చెక్‌పోస్టు దగ్గరకు వెళ్లాడు.

ఓరగా ఆమెను చూసాడు.

తెల్లగా పాలనురుగులాంటి చీర.

తల్లో మల్లెపూలు... మెల్లో బంగారు వస్తువులు. చెవులకున్న జుంకాలు చూసి అదిరిపడ్డాడు. ఆ జుంకాలు... ఆ జుంకాలు తనుకు బాగా పరిచయమున్నవి.

అన్యమనస్కంగానే ఆమె మొహం పరిశీలించి అదిరిపడ్డాడు.

అతని గుండె ఆగినంత పనయింది.

అతని మెదడు మొద్దుబారిపోయింది.

అవయాలు స్వాధీనం తప్పాడు.

ముక్కు... ఆ ముక్కున ముత్యంలాంటి ముక్కు పుడక. ఆ... ఆ ముక్కు పుడక... తనే... తనే వైజాగ్ నుండి తెచ్చాడు.

గేటుదాటి ముందుకు అడుగువేసాడు.

ఆమె మాధవ్‌ని చూసి చిన్నగా నవ్వింది.

ఆ నవ్వు... ఆ నవ్వు కూడా అతనికి బాగా పరిచయమున్నదే!

ధైర్యం బిక్క బర్చుకొని ముందుకు వెళ్ళినవాడల్లా ఆగి అడిగాడు మాధవ్.

"ఎవరదీ?!"

ఎంత భీకరంగా ప్రశ్నద్దామనుకున్నా పిరికితనం... భయం కొట్టొచ్చినట్టూ అతని గొంతులో ధ్వనించాయి.

"నేనే!"

ఆమె సమాధానికి ఉలిక్కిపడ్డాడు.

ఆ సమాధానికేకాదు. ఆ ధైర్యానికి.. ఆ గొంతు వినని మరింత ఆశ్చర్యపోయాడు.

"నువ్వంటే...? ఎవరు?"

"నేనే!"

మరింత భయంకరంగా ఉంది ఆమె గొంతు.

"ఇక్కడెందుకు కూర్చున్నావ్!"

నీకెందుకు?"

ఆమె సామాధానాలకు మాధవ్ ధైర్యం ఎగిరిపోయింది.

మరింకేమని ప్రశ్నించగలడు?

భయం... భయంగానే ఇంట్లోకి పరుగందుకున్నాడు.

గబగబా లైట్లన్నీ వేసాడు.

ఆ లైట్ల కాంతికి ఇంటిల్ల పాదీ ఉలిక్కిపడి లేచారు.

మాధవ్ వాలకం చూసి అందరూ అవాక్కయ్యారు.

మాధవ్ భయంతో చాలా సేపు బిక్కచచ్చిపోయాడు. మౌనంగా మంచం మీద కూలబడ్డాడు.

"ఏమైందిరా?! ఏమైందిరా మాధవ్!"

పెద్దన్నయ్య మాధవ్ బజాలు పట్టుకొని కుదిపి కుదిపి అడిగేసరికే తేరుకున్నాడు మాధవ్.

"అన్నయ్యా... వదిని... వదిన కన్పించింది"

"కల్లోనా!"

"కా...కాదు.. రోడ్డు మీద... మన గేటు దగ్గర కూర్చొని ఉంది"

ఆ మాటలకు ఇంటిల్లిపాదీ అదిరిపడ్డారు.

మాధవ్ పెద్దన్న ధైర్యం చేసి "పద చూద్దాం!" అంటూ టార్చి తీసుకొని బయల్దేరాడు.

ఆ వెనుకే మాధవ్ కూడా వెళ్ళాడు.

వాళ్ళు వేళ్ళేసరికి అక్కడా ఎవరూ లేరు.

"ఏ్రా?! ఎక్కడ?!"

"ఇక్కడే... ఇక్కడే అన్నయ్యా! నేను చూసింది".

మాధవ్ ఇంకా ఆ షాక్ నుండీ తేరుకోలేదు.

"నువ్వెళ్ళి పడుక్కో! నేను అలా చూసి వస్తాను." అంటూ అతను బజార్లోకి టార్చి పట్టుకొని పరిగెట్టాడు.

ఎదురుగా అర్ధరాత్రి టీ దుకాణం కన్పించింది.

మాధవ్ టీ దుకాణంకి వెళ్ళాడు.

"టీ" త్రాగి లేచాడు.

ఈ హోటల్లో నుండి బైటకు రావడానికి బయల్దేరిన మాధవ్ ఉలిక్కిపడ్డాడు.

ఆమె...

ఇందాక తాను గేటు దగ్గర చూసిన స్త్రీ...

వదిన!

వ... ది...న!

కాదు... కాదు... కాదు!

ఎవరో?!

ఓ స్త్రీ!

అచ్చం మా వదినలాగే ఉంది.

జుంకాలు.. ముక్కుపుడక... అంతా అచ్చం మా వదిన లాగే వుంది.!

ఆమెని చూసి నాకళ్ళను నేనే నమ్మలేక పోయాను!

అప్రయత్నంగానే ఆమె కాళ్ళను పరీక్షించాను.

వంకర్లు తిరిగి లేవు!


